నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | జనవరి 11, 2025 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యా భారతి విద్యార్థులు

నవతెలంగాణ-తాండూర్

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యా భారతి విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ సురభి శరత్ కుమార్ తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో నిర్వహించిన హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలలో విద్యా భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. డి.హరీష్ 10వ తరగతి, ఐ.విష్ణువర్ధన్ 8వ తరగతి ఇద్దరు విద్యార్థులు 13, 14 తేదీల్లో జరిగే 46వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్, ప్రిన్సిపాల్ సరోజిని, పిటిలు, ఉపాధ్యాయులు అభినందించారు.



బాకీ డబ్బులు అడిగినందుకు వృద్ధుడి హత్య

లక్షెట్టిపేట: బాకీ డబ్బులు అడిగినందుకు మండలంలోని జెండవెంకటాపూర్ గ్రామానికి చెందిన వెల్తపు పోచయ్య(65)ను అదే గ్రామానికి చెందిన శంకరయ్య కర్రతో బాది హత్య చేశాడు. ఎస్ఐ పి.సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కోన శంకరయ్య పోచయ్య వద్ద రూ.30వేలు అప్పు తీసుకున్నాడు. వీటిని తిగిరి ఇవ్వాలని వృద్ధుడు అడగడంతో కోపోద్రేకుడైన శంకరయ్య 7న రాత్రి కర్రతో బలంగా తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు పోచయ్యను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మనవడు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



నవతెలంగాణ-మంచిర్యాల

తమ న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు శుక్రవారం ఐబీ చౌరస్తాలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేటెడ్ పదవులలో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీ ఫెడరేషన్లకు పాలకమండలి ఏర్పాటు చేయాలని, లక్ష కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, బీసీ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు చట్టబద్ధత కల్పించి ఒక్కొక్క కార్పొరేషన్‌కు రూ.2000 కోట్లు మంజూరు చేయలన్నారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అత్యాచార నిరోధక చట్టాన్ని బీసీలకు వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ టెండర్లలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, బీసీ గౌరవ అధ్యక్షులు కర్రే లచ్చన్న, డాక్టర్ బొడ్డు రఘునందన్, శాఖపురి భీమ్‌సేన్ పాల్గొన్నారు.

మరో అవార్డు ఎస్టీపీపీ సొంతం

- ఢిల్లీలో అవార్డు అందుకున్న ఎస్టీపీపీ అధికారి పంతులా నాయక్



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ మరో అవార్డును సొంతం చేసుకుంది. శుక్రవారం ఢిల్లీలో ఎస్టీపీపీ ప్రతినిధిగా ప్లాంట్ అధికారి డీజీఎం ఈఅండ్ ఎం పంతులా నాయక్ ఈ అవార్డును అందుకున్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం అత్యల్పంగా నీటిని వినియోగిస్తున్నందుకు బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డుకు ఎంపికైంది. ఢిల్లీలో జరిగిన 3వ జాతీయ పవర్ జెనరేషన్ వాటర్ మేనేజిమెంట్ అవార్డ్స్-2025 కార్యక్రమం ద్వారా అవార్డును ప్రకటించినట్లు సంస్థ వెల్లడించింది. కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్స్ సంస్థ అవార్డు ప్రదానం చేసింది. జాతీయ స్థాయిలో 500 మెగావాట్లు ఆపైన సామర్థ్యం గల సుమారు 150 ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ కేంద్రాల్లో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఈ అవార్డును సొంతం చేసుకుంది. అవార్డు అందుకోవడం పట్ల సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్, డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు ప్లాంట్ ఉద్యోగులను అభినందించారు. ఎస్టీపీపీ ద్వారా ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌కు అతి తక్కువగా నీటిని వినయోగిస్తున్నట్లు ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) రాజశేఖర్‌రావు తెలిపారు. అతి తక్కువ నీటి వినియోగిస్తున్న తీరుకు గుర్తింపుగా ఎస్టీపీపీ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. విద్యుత్ కేంద్రంలో తీసుకుంటున్న పర్యావరణహిత చర్యలకు ఇప్పటికే పలు జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నామని పేర్కొన్నారు.

చీడపీడల నివారణలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-జైపూర్

వేరుశనగ పంటలు సాగు చేస్తున్న రైతులు చీడపీడల నివారణ కోసం ముందస్తు జాగ్రత్తలు పాటించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ సూచించారు. శుక్రవారం గోపాల్‌పూర్, పౌనూర్ శివారులో సాగు చేస్తున్న వేరుశనగ పంట క్షేత్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. వేరుశనగ సాగు చేస్తున్న రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమగ్ర సస్యరక్షణ చర్యలతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగలో తిక్క ఆకుమచ్చ తెగులు గుర్తించినట్లు తెలిపారు. నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ చొప్పున టేబ్యుకోనోజోల్ శిలీంద్ర నాశిని పిచికారి చేయాలని సూచించారు. గూడలు దిగే సమయంలో శాస్త్రవేత్తలు సూచించిన మేరకు జిప్సం వాడిన రైతు క్షేత్రాలలో గింజల పరిమాణం, నాణ్యత, రంగు మెరుగ్గా ఉంటుందని, నూనె శాతం పెరగడంతో పాటు కోత సమయాన్ని తగ్గించడానికి జిప్సం అవరమని తెలిపారు. చెన్నూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రసాద్ మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు పంట క్షేత్రాల్లో గుర్తించిన స్థితిగతులను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో మాట్లాడి వారి సూచనలు సలహాల మేరకు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆశించిన దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

బ్యాడ్జీ నంబర్‌తో సంబంధం లేకుండా దరఖాస్తులు స్వీకరించాలి

రెబ్బెన : సింగరేణి యాజమాన్యం కార్పొరేట్ స్థాయిలో ఆహ్వానించిన వాహన టెండర్ల దరఖాస్తు తేదీని పొడిగించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం కొత్తగూడెంలోని జనరల్ మేనేజర్ (ట్రాన్స్‌పోర్ట్) సీతారాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు దుర్గం రవీందర్ మాట్లాడుతూ వాహన టెండర్ల దరఖాస్తు తేదీని పొడిగించాలన్నారు. టెండర్ వేసేందుకు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు బ్యాడ్జీ నంబర్ ఉండాలనే నిబంధనతో చాలామంది సింగరేణి మాజీ కార్మికుల పిల్లలు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. బ్యాడ్జీ నంబర్ లేకపోయినా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుదరి సాయి, పర్వతి సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్థలం కోసం అన్వేషణ..!

- మోడల్ హౌస్‌ల నిర్మాణానికి స్థలాల కొరత
- జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది మాత్రమే గుర్తింపు
- మిగతా వాటి కోసం కొనసాగుతున్న కసరత్తు
- మావలలో నిర్మాణం ప్రారంభించిన మంత్రి సీతక్క
- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే

పేదోడి సొంతింటి కల ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు సమయం ఆసన్నమైంది. ఈ క్రమంలో ప్రభుత్వం తొలుత మోడల్ హౌస్(నమూన)లను నిర్మించాలని తలపెట్టింది. వీటి ప్రకారం లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకునేందుకు సులువుగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో తొలుత అన్ని ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణలో ఈ మోడల్ హౌస్‌లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేయగా.. స్థలాల కొరత అధికారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికి కేవలం మండల కేంద్రాల్లో ఈ ఇంటి నిర్మాణాలకు ఎనిమిది చోట్ల మాత్రమే స్థలాలు లభించగా.. మిగితా చోట్ల స్థల సమస్య తీవ్రంగా ఉంది. దీంతో అధికార యంత్రాంగం అనువైన స్థలాల కోసం అన్వేషణ ప్రారంభించారు. కాగా ఈ నమూనా ఇండ్లు ప్రారంభించిన నెలన్నర రోజుల్లో పూర్తిచేయాలని..వీటిని అనుసరించి అయా మండలాల్లో లబ్ధిదారులు నిర్మించుకునేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వీటి నిర్మాణ బాధ్యత గృహనిర్మాణశాఖకు ప్రభుత్వం అప్పగించింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనేక ఏండ్లుగా సొంత ఇండ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ప్రభుత్వం అతి త్వరలోనే వీటిని సమకూర్చనుంది. ఇప్పటికే లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి సర్వే కొనసాగుతుండగా.. మరో రెండు, మూడు రోజుల్లో పూర్తికానుంది. ఇదిలా ఉండగా లబ్ధిదారుల ఎంపికకు ముందు జిల్లాలోని అర్బన్ మండలం తప్పితే..మిగితా 17చోట్ల మండల కేంద్రాల్లో వీటిని నిర్మించాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వీటి కోసం స్థలాలు సేకరించి ఒక్కో ఇల్లు 400స్కేర్ మీటర్ల వ్యాసార్ధంలో వీటిని నిర్మించనున్నారు. కాగా అధికారులు ఇప్పటి వరకు సిరికొండ, గుడిహత్నూర్, జైనథ్, బేల, మావల, ఉట్నూర్, తాంసి, బోథ్‌లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో స్థలాలు ఎంపిక చేయగా..ఆదిలాబాద్ అర్బన్ మినహా మిగితా తొమ్మిది మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాల్లో అనువైన స్థలాలు లభించడం లేదు. దీంతో ఇతర శాఖల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఈ నమూన ఇండ్ల కోసం ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది.

45రోజుల్లో పూర్తి చేయాలి..!

జిల్లాలో నమూన ఇందిరమ్మ ఇండ్లను కేవలం 45రోజుల్లోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే మావల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నమూన ఇంటికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే స్థలాలు గుర్తించిన మిగితా చోట్ల కూడా సంక్రాంతి తర్వాత పనులు మొదలుపెట్టేలా అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు కేటాయించగా.. నమూన ఇండ్ల నిర్మాణ బాధ్యతలను గృహనిర్మాణశాఖకు అప్పగించింది. ప్రభుత్వం నిర్దేశించిన నమూనలో కిచెన్, బెడ్‌రూం,హాలుతో పాటు అటాచ్డ్ బాత్‌రూం నిర్మిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం ఇస్తున్న నిధులతో పాటు లబ్ధిదారులు సొంతంగా కొంత ఖర్చు భరిస్తే వారు ఇష్టపూర్వకంగా విశాలంగానూ ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం కల్పించింది. కానీ ప్రభుత్వ ప్రమాణాల కంటే తక్కువ విస్తీర్ణంలో మాత్రం నిర్మించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.



ఇటీవల మోడల్ నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన మంత్రి సీతక్క, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్

పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక..!

ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇంటి కోసం 1,99,803 మంది దరఖాస్తులు అందించారు. ప్రస్తుతం లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన సర్వే కొనసాగుతోంది. అధికారులు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలను ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇందులో ఇంటి స్థలం ఉండి గుడిసెలు, రేకుషెడ్డు, శిథిలావస్థలో ఉన్న పెంకుటిల్లు తదితర వాటిని పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేయనున్నారు. ముఖ్యంగా లబ్ధిదారులు పేదలై ఉండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపికలో సూపర్ చెకింగ్ కూడా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ అధికారులు వేర్వేరుగా క్షేత్రస్థాయిలో వెళ్లి నిజమైన లబ్ధిదారులా.. కాదా అని పరిశీలన చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ఎస్సీ,ఎస్టీలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇంటి నిర్మాణానికి నాలుగు విడతల్లో ప్రభుత్వం సాయం అందించనుంది. జిల్లాలో ప్రస్తుతం సర్వే కొనసాగుతున్నందున మరో రెండు, మూడు రోజుల్లో పూర్తికానుంది. ఈ తర్వాతే లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలకు అనుమతించనున్నారు. కాగా ఇల్లు మంజూరైన లబ్ధిదారుడు మూడు నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసుకోవాల్సి ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.



అన్ని చోట్ల నిర్మాణాలు చేపడుతాం : బసవేశ్వర్, గృహనిర్మాణశాఖ పీడీ, ఆదిలాబాద్

జిల్లాలో ఇప్పటికే ఎనిమిది మండల కేంద్రాల్లో నమూన ఇండ్ల కోసం స్థలాలు గుర్తించాం. మావలలో నిర్మాణం ప్రారంభమైంది. మిగితా చోట్ల కూడా ఈ ఇండ్ల కోసం స్థలాలను పరిశీలిస్తున్నాం. ఈ నమూన ఇండ్ల నిర్మాణం పూర్తికాగానే ఎంపికైన లబ్ధిదారులు సైతం వీటి ప్రకారం ఇండ్లు నిర్మించుకునేందుకు అనువుగా ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.

పోలీసులు సమాజ సేవే లక్ష్యంగా పని చేయాలి

- మంచిర్యాల డీసీపీ భాస్కర్



నవతెలంగాణ-తాండూర్

పోలీసులు సమాజ సేవే లక్ష్యంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని మంచిర్యాల డిసిపి భాస్కర్ తెలిపారు. మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సాపూర్ గ్రామ ప్రజలకు శుక్రవారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిసిపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజా సేవే లక్ష్యంగా శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలు చేపడుతూ ప్రజలతో స్నేహభావంతో మెలగాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసుకొని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. పోలీస్ అధికారులు యువత, మహిళా సంఘాలతో తత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. గిరిజన గ్రామాల ప్రజలు మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పథకాలు అమలు చేస్తోందన్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని సంఘ విద్రోహ శక్తులు గిరిజనులను ప్రలోభాలకు గురిచేసి చెడు మార్గం వైపు దారి మళ్లిస్తున్నారని తెలిపారు. అనంతరం డీసీపీతోపాటు ఏసీపీ ఇతర పోలీసు అధికారులు గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమార స్వామి, ఎస్సై కిరణ్ కుమార్, మాదారం ఎస్సై సౌజన్య, మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి సురభి శరత్ కుమార్, సభ్యులు సంతోష్, లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిటిసి సూరం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచముఖి హనుమాన్, వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్న సీపీ

నవతెలంగాణ-మందమర్రి

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్ పంచముఖి హనుమాన్, వెంకటేశ్వర స్వామి ఆలయాలలో పూజారులు అనంత ఆచార్యులు, డింగరి కృష్ణకాంత్ చార్యులు, నరసింహ శాస్త్రి చార్యులు మంత్రోచ్చరణ నడుమ దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ, డీసీపీలను స్వామి వారి శేష వస్త్రాలతో ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దైవ దర్శనం కొరకు అన్ని ఆలయాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ క్యూలైన్లు పాటిస్తూ దైవ దర్శనం చేసుకొని ప్రశాంతంగా వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

మంచిర్యాల : జిల్లా కేంద్రంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్వనాథ ఆలయం, హైటెక్ సిటీలో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కాకుండా క్యూలైన్‌లు, ప్రత్యేక దర్శనానికి సంబంధించి ఏర్పాట్లు చేపట్టారు. ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుండే ఆలయాల దగ్గర బారులు తీరారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి విశ్వనాథ ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శనం చేసుకున్నారు. మంచిర్యాల మున్సిపల్ ఛైర్మెన్ రావుల ఉప్పలయ్య, ఆలయ అభివృద్ధి సమన్వయకర్త తూముల నరేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మందమర్రి :



మంచిర్యాల :

జైపూర్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భీమారం మండల కేంద్రంలో గల కోదండ రామాలయంతో పాటు జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామంలో గల రామాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉత్తర ముఖ ద్వారం ద్వారా దర్శనమిచ్చిన సీతారామచంద్రమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. భీమారం మండల కేంద్రంలో గల రామాలయం ప్రధాన అర్చకులు తిరునగరి కన్నయ్యతో పాటు ప్రవీణలు దేవతామూర్తులకు ముక్కోటి ఏకాదశిని సందర్భంగా కైంకర్యాలు సమర్పించిన అనంతరం దేవతామూర్తుల దర్శనానికి భక్తులను అనుమతించారు. షెట్‌పల్లి గ్రామంలో గల రామాలయంలో గల రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ విగ్రహాలను భక్తుల దర్శనార్థం ఉత్తర ముఖ ద్వారం ద్వారా అనుమతించారు.

ప్రభుత్వ పాఠశాల ప్రత్యేక క్యాలెండర్ ఆవిష్కరణ

- హెచ్ఎంను అభినందించిన ఎంఈఓ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నూతన సంవత్సరం వచ్చిందంటే చాలు క్యాలెండర్ల ఆవిష్కరణలు ప్రారంభం కావడం సర్వసాధారణం. ప్రైవేట్ విద్యాసంస్థలు తమ ప్రచారం కోసం విరివిగా క్యాలెండర్లను ముద్రించి పంపిణీ చేస్తుంటాయి. కాని ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకంగా క్యాలెండర్లను ముద్రించి పంపిణీ చేయడం మీరెప్పుడు చూసి ఉండరు. కాని కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము లక్ష్మీనారాయణ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని చెపుతూ 'మంచి చదువుకు మాది భరోసా' అనే నినాదంతో ఒక క్యాలెండర్‌ను ముద్రించి పంపిణీ చేస్తున్నారు. ఈ క్యాలెండర్లను శుక్రవారం కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ గ్రామ పెద్దల సమక్షంలో ఆవిష్కరించి, ఈ ఆలోచన చేసిన ప్రధానోపాధ్యాయుడు కొమ్ము లక్ష్మీనారాయణను అభినంధించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను కూడా ఎంఈఓ తిలకించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనురాధ, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శాంతికుమార్, సీనియర్ ఉపాధ్యాయులు తూడూరు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పెరుగు విలాస్, ఆర్ సత్యనారాయణ, పుష్పలత, వి రాజేష్, పాఠశాల ఎఐపీపీ ఛైర్మన్ మల్లీశ్వరి, వీఓ లత, మాజీ సర్పంచ్ ఉమ, మాజీ ఎంపీటీసీ పోశయ్య, మాజీ వార్డు సభ్యుడు ఆయిల్ల శంకర్ పాల్గొన్నారు.

గోలేటిలో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామపంచాయతీలోని రేకులగూడెం, అంబేద్కర్‌నగర్ విద్యుత్ దీపాలు లేక భయభ్రాంతులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శి ఉండడంతో పనులు సరిగ్గా కావడం లేదని పేర్కొంటున్నారు. సమస్యలు చెప్పుకోవడానికి కార్యదర్శి అందుబాటులో కూడా ఉండడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాలలో ఎక్కడ చెత్త అక్కడే ఉండడంతో పాటు మురుగు కాల్వలు నిండి పోతున్నాయని తెలుపుతున్నారు. ఇకనైనా అధికారులు పట్టించుకొని గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ-కాసిపేట

గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో నిందితుల అరెస్ట్ చూపించి వివరాలను వెల్లడించారు. కల్వరీ చర్చి ఎదురుగా ఉన్న టేకు చెట్లలో మందమర్రికి చెందిన ఇద్దరు నిషేధించబడ్డ గంజాయిని బల్లార్షా నుండి తీసుకువచ్చి అమ్ముతుండగా మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడ్డ వారిలో మందమర్రికి చెందిన శహాని సందీప్, ఉన్ని పవన్ ఉన్నారు. వారి నుంచి రూ.3500 విలువ గల 140 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఒక పల్సర్ బైక్, సెల్ ఫోన్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | జనవరి 11, 2025 | www.navatelangana.com

ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పంచగుడి-ధర్మోర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల్లో 10వ తరగతి విద్యార్థులు పలువురు పోటీ చేయగా నలుగురు విద్యార్థులు ఎన్నికల్లో పాఠశాల ప్రతినిధులుగా ఎన్నుకోబడ్డారు. వారిలో పాఠశాల లీడర్‌గా



స్రవంతి, గేమ్స్ లీడర్‌గా సాయి కిరణ్, డిప్యూటీ స్కూల్ లీడర్‌గా గణీత్, ఫుడ్ లీడర్‌గా చందు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్, నారాయణ, గంగాధర్, తరుణ్ తేజ, అక్షయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ జాదవ్ పరుశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా విద్యార్థులు, కళాశాల అధ్యాపకులచే వేరువేరు సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో వారు విద్యార్థులతో ముచ్చటిస్తూ త్వరలో ప్రయోగ పరీక్షలు, వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సమయాన్ని వృథా చేయకుండా ఒక ప్రణాళిక బద్ధంగా చదువాలన్నారు. అధ్యాపకులతో సిలబస్, ప్రయోగ పరీక్షలపై ఆరా తీశారు. ప్రయోగశాల గదిలో సీసీ టీవీ పుటేజి ఏర్పాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గౌతమ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విఠల్, వెంకటేశ్వర్, ప్రమీల రాణి, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, మహేందర్, సాయినాథ్, హరీష్ పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

- ఏఎస్పీ రాజేష్ మీనా



నవతెలంగాణ-సారంగాపూర్

సీసీ కెమెరాలతో 90శాతం నేరాలను తగ్గించవచ్చని ఏఎస్పీ రాజేష్ మీనా అన్నారు. శుక్రవారం మండలంలోని వైకుంఠపూర్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామస్తులంతా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, పరిసరాలను పరిశీలించారు రికార్డులను తనిఖీ చేశారు. పోలీసులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో స్నేహ పూర్వకంగా వారి సమస్యను తెలుసుకొని, సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఖానాపూర్ మండల ఆశా కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకొని, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని క్యాంపు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో గేటుకు అతికించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల నిర్ణీత వేతనం నిర్ణయించే విధంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ప్రమోషన్ పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు గంగామణి, స్వప్న, త్రివేణి, సంధ్య, కమల, స్వాతి, మమత, లక్ష్మి, లావణ్య, ఉన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని మాడగూడ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 30లక్షలతో ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన ఎంపీ గోడం నగేష్‌కు, ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు విద్యార్థులు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం తరగతి గదులను సందర్శించి, విద్యార్థినులతో ముచ్చటిస్తూ పాఠశాలలో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువులో రాణించాలని అన్నారు. అనంతరం భూమిపూజ చేసి పనునులను వేగవంతంగా పూర్తిచేయాలనీ సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్, బీఆర్ఎస్ కన్వీనర్ రాజారాం, యూత్ అధ్యక్షులు డుబ్బుల చంద్రశేఖర్, నాయకులు చిలుకూరి భూమన్న, కేవల్ సింగ్, రమణ, నాటెం రమణ, చట్ల గజ్జయ్య, మడావి ప్రకాష్, అందె ప్రకాష్, విద్యాసాగర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓను కలిసిన టీయూటీఎఫ్ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జెడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డిని టీయూటీఎఫ్ నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఈఓను సన్మానించి, టీయూటీఎఫ్-2025 డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంద్రవెల్లికి అదనంగా ఒక అటెండర్‌ను పిల్లల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఇవ్వాల్సిందిగా కోరారు. దీనికి జితేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ సుధాకర్, టీయూటీఎఫ్ అర్బన్ అధ్యక్షులు సంజయ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంద్రత్ నారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంతో పాటు కడెం, పెంబి, దస్తురాబాద్, మండలాల్లో రెండో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈబీ లక్ష్మణ్ నాయక్, ఏఈ రాంసింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెలవారి మరమ్మతులు చేయుటకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. పరిసరాల్లో ఉన్న చెట్ల కొమ్మలు నరికి వేయనున్నట్టు తెలిపారు. నాలుగు మండలాల్లోని అన్ని గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గంగాజలానికి పయనమైన మెస్రం వంశీయులు

- మురాడి వద్ద సమావేశం
- సాంప్రదాయ పద్ధతిలో పూజలు
- తొలి సారి సెల్ ఫోన్ వాడకం నిషేధం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గిరిజనుల ఆరాధ్య దైవం రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన రెండో అతిపెద్ద జాతర నాగోబా తొలిఘట్టం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లోని మురాడి వద్దకు చేరుకుని సమావేశమయ్యారు. పటేల్ చిన్ను, కటోడ కోసు, కోసేరావ్, మెస్రం శేఖర్‌ల ఆధ్వర్యంలో గంగా జలం కోసం వెళ్ళే దారులపై చర్చించారు.

ఆచార సాంప్రదాయాలకు పెద్దపీట....

ఈ సారి గంగా జలానికి పయనించే మెస్రం వంశీయులు ఆచార సాంప్రదాయాలను పాటించాలని సూచించారు. ఎలాంటి సెల్ ఫోన్ వాడకూడదని, తెల్ల దోతీని మాత్రమే ధరించాలన్నారు. బడి పిల్లలకు కుటుంబీకులు తమ వెంట తీసుకుని రాకూడదని ఏక గ్రీవంగా తీర్మానించారు. సాంప్రదాయ పూజల అనంతరం గంగా జలాని వెళ్లే కటోడ కోసు వీపుకు తెల్లటి బట్టతో కలశంను కట్టి సాగనంపారు. 10న శుక్రవారం ఇంద్రవెల్లి మండలం భట్టగూడ బయలు దేరి రాత్రి బస చేస్తారు. 11న శనివారం వడగావ్‌లో బసచేసి, 12న ఆదివారం ఉట్నూర్ మండలం సాలేవాడలో బస చేస్తారు.13న సోమవారం ఉట్నూర్ మండలంలోని ధర్మగూడ ముకాం చేసి, 14న మంగళవారం ఉట్నూర్ మండలంలో కొత్తగూడలో బసచేసి, 15న బుధవారం కడెం మండలంలోని ఉడుంపూర్‌లో బస చేస్తారు. 16న గురువారం జన్నారం మండలంలోని మల్లాపూర్‌లో బస చేసి, 17న శుక్రవారం జన్నారం మండలంలోని గోదావరిలో హస్తినమడుగు చేరుకుంటారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి పవిత్ర గంగాజలాన్ని సేకరిస్తారు. తిరుగు ప్రయాణంలో 18న శనివారం ఆయన ఉట్నూర్‌లో బస చేస్తారు.19న ఆదివారం నర్సాపూర్‌లో బసచేస్తారు. అనంతరం చివరి రోజున ఇంద్రవెల్లి మండలం దోడందలో బసచేస్తారు.

నాగోబాకు రూ.95వేల విరాళం

గిరిజనుల ఆరాధ్యదైవం కేస్లాపూర్‌లోని నాగోబా గుడి అభివృద్ధికి గాదిగూడ గ్రామస్తులు రూ.95వేలు సేకరించిన విరాళాన్ని శుక్రవారం అందజేశారు. నాగోబా దేవాలయం అభివృద్ధికి ప్రతి మెస్రం కుటుంబం నుంచి ప్రతి ఏటా రెండు వేల రూపాయలను విరాళాలను ఇవ్వాలని తీర్మానం చేశారు. అప్పటి నుంచి ప్రతి కుటుంబం నుంచి ఈ విరాళాలను సేకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ విరాళాన్ని మెస్రం ఉద్యోగుల సంఘం నాయకుడు శేఖర్, నాగనాథ్, మెస్రం తుకారాం ఆధ్వర్యంలో అందజేశారు.



ఎమ్మెల్యే ఆదిలాబాద్ భూబకాసురుడు

- దాదాపు రూ.400 కోట్ల భూమిని మింగేసిన ఎమ్మెల్యే
- కంది శ్రీనివాస్‌రెడ్డి సంచలన ఆరోపణలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో భూబకాసురుడు ఎవరంటే టక్కున ఎమ్మెల్యే పాయల శంకర్ పేరే చెబుతారని, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పాయల శంకర్ చేసిన భూకబ్జాలు భూబాగోతాన్ని బయట పెట్టారు. ఇవిగో ఆధారాలు అంటూ వాటికి కొన్ని ఆధారాలు మీడియా ముందు చూపించారు. గడిచిన పదమూడు నెలల్లో ఎమ్మెల్యే చేసిన భూదందా విలువ సుమారు నాలుగు వందల కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఆయన డైరెక్టర్‌గా ఉన్న కంపెనీలను ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపర్చలేదన్నారు. తన పేర స్థిరాస్తులకు సంబంధించి ఫారమ్-26లో పేర్కొన్న విధంగా భూముల వివరాలు అసలు రెవెన్యూ రికార్డుల్లో లేనే లేవన్నారు. మరికొన్ని ఆయన పేరుతో కాకుండా ఇతరుల పేరుపై ఉన్నాయన్నారు. అంటే అవన్నీ బినామీల పేర్లతో ఉన్నాయా లేదా భవిష్యత్తులో కబ్జా చేసేద్దామనుకొని ముందే తనవి కాని స్థలాలను తనకు చెందినట్లుగా అఫిడవిట్‌లో చూపించారా అని ప్రశ్నించారు. కొంత మంది భాగస్వాములు అనుచరులతో కలిసి ఆదిలాబాద్‌లో భూ మాఫియా నడిపిస్తున్నాడని ఆరోపించారు. ల్యాండ్ సెటిల్ మెంట్లు చేయడం ఆయనకు వెన్నెతో పెట్టిన విద్య అన్నారు. కబ్జాల చరిత్ర ఆ పార్టీ అధిష్టానికి కూడా తెలిసిందని మరోమారు ఆయన ఎమ్మెల్యే కాలేడన్నారు. అందుకే ఈ మిగిలిన నాలుగేండ్లు ఎంత దొరికితే అంత దోచుకుని దాచుకుందామని చూస్తున్నారన్నారు. ఆయన భూబాగోతాన్ని అందుకు సంబంధించిన రుజువులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందు సమర్పిస్తామని, అంతే కాకుండా బీజేపీ అధిష్టానికి కూడా పంపిస్తామన్నారు. ఆయన దోచుకున్న భూములను వెనక్కి తీసుకుంటే 35 వేల మంది పేదలకి ఇంటి సమస్య తీర్చవచ్చన్నారు. ఇన్నాండ్లు తన ఆటలు సాగాయని, ఇక ముందు సాగబోవన్నారు. ఇప్పటికే ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, భూ బాధితులు వరుస పెట్టి వస్తున్నారని, ఈ ఆధారాలన్ని వాళ్ళ ఇచ్చినవేనన్నారు. అందుకే భూకబ్జా బాధితుల కోసం 7436879999 ఒక హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాధితులెవరైనా ధైర్యంగా సంప్రదించాలని, లేదా వాట్సాప్‌లో సంబంధిత డాక్యుమెంట్స్ పంపించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తాను ఉన్నంత వరకు మాఫియాను అడ్డుకుంటానని అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు. ఈ సమావేశంలో మావల ఎంపీపీ దర్శనాల ఏవన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావు పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు బండారి సతీష్, ఆవుల వెంకన్న, యెల్మెల్వార్ రామ్ కుమార్, భూమన్న, దర్శనాల లక్ష్మణ్, ఇమ్రాన్, జాఫర్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు కేజీబీవీలో ఏం పని...?

- ప్రిన్సిపాల్ వైఖరి అనుమానాస్పదం
- గతంలోనూ ప్రయివేట్ కళాశాల అధ్యాపకులతో చర్చల వివాదం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- ప్రశ్నార్థకంగా మారిన కేజీబీవీ విద్యార్థుల రక్షణ



నవతెలంగాణ-కుభీర్

పేద, మధ్యతరగతి బడి బయట ఉన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. స్కూల్‌లోకి బయట వ్యక్తులకు ప్రవేశం లేదన్న నిబంధనలను కొందరు అధికారులు తుంగలో తొక్కుతున్నారు. ఇందుకు నిదర్శనం కుభీర్ కేజీబీవీ పాఠశాల నిదర్శనంగా నిలుస్తోంది. శుక్రవారం సంక్రాంతి పండగ సందర్భంగా తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటికి తీసుకు వెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రుల ముందే కొందరు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాఠశాలలోకి వెళ్లి చాలా సేపటి తర్వాత బయటకు వచ్చారు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు అది గమనించి, వారు ఎవరు...? ఎందుకు లోపలికి వెళ్లారు. అని ప్రశ్నించగా, ప్రత్యేక అధికారులని ప్రిన్సిపాల్ చెప్పటంతో పలు అనుమానాలకు తావిచ్చే అంశంగా మారింది. ఎందరు ప్రత్యేక అధికారులు ఉంటారని ప్రశ్నించగా ఒకరే ఉంటారని, అంటూనే సమాధానాన్ని దాటవేశారు. దీంతో కొంతసేపు తల్లిదండ్రులు ఆందోళనకు దిగటంతో వారికి లోపలికి పిలిపించుకొని, సముదాయించటం గమనార్హం. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగిన విషయం తెల్సిందే. విద్యార్థుల తల్లిదండ్రులపై అంక్షలు విధించే అధికారి కానీ ప్రయివేటు వ్యక్తులకు లోనికి రప్పించడం చెప్పటంలో ఆంతర్యం ఎంటో ఆ శాఖ ఉన్నత అధికారులకే తెలియాలి. ఈ విషయమై మండల విద్యాధికారికి ఫోన్లో ప్రశ్నించగా శివ అనే అధికారికి కలెక్టర్ స్పెషల్ ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. మిగతావారు అతని ఫ్రెండ్స్ అయి ఉండొచ్చని తెలిపారు.

మిషన్ భగీరథ నీరందివ్వాలని రాస్తారోకో

నవతెలంగాణ-ముధోల్

మిషన్ భగీరథ నీరందివ్వాలని మండలంలోని న్యూముధ్గల్ గ్రామస్తులు బాసర-భైంసా రహదారిపై శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. వారం రోజుల నుంచి నీళ్ల అందక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆరోపించారు. ఈ విషయం సంబందిత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. సుమారు 20 నిమిషాల పాటు రోడ్డుపై బైఠాయించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ముధోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. వెంటనే ఎంపీడీఓ శివ కుమార్‌కు ఫోన్ చేయడంతో ఎంపీడీఓ సంఘటన స్థలానికి చేరుకొని సంబందిత అధికారులతో మాట్లాడారు. రెండు రోజులలో నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సమస్య సద్దు మనిగింది. రోడ్డుపై రాస్తా రోకో చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలి



నవతెలంగాణ-కడెం

విద్యార్థులు శ్రద్ధతో చదువుకుంటే రాబోయే టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని మండలంలోని లింగాపూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ అన్నారు. శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.భూమేశ్వర్, ఐ.రాజేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రమేష్ బిదూరి దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదూరి దిష్టిబొమ్మను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఢిల్లీలో ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తెలంగాణ స్టేట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, యువజన కాంగ్రెస్ నాయకులు బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదూరి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాయకులపై అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ యూత్ అధ్యక్షులు అత్రం రాహుల్ దేవ్, ఉపాధ్యక్షులు పరమేశ్వర్‌రావ్, మండల యూత్ అధ్యక్షుడు రాజ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుట రాజేశ్వర్, ఎర్దండి సుశీల్ కుమార్, కలీం, భీమన్న, గంగేశ్, అశోక్, భాస్కర్, సల్మాన్ రాజ్, కైలాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు అందజేత

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన వి.చంద్రం అనారోగ్యంతో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షల50వేల ఎల్ఓసీ చెక్కును బాధిత కుటుంబానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. చెక్కు అందజేసేందుకు కృషి చేసిన శ్రీహరిరావుకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీంరెడ్డి, కౌన్సిలర్ అన్వర్, ముజ్జు చౌస్, చామకూర రాము ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, మండలంలోని టోల్ ప్లాజా వద్ద శుక్రవారం భారత జాతీయ రహదారుల అధీకృత సంస్థ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. పదే పదే ఓవర్టెక్ చేయవద్దని, వాహనాలు నడిపే సమయంలో ఫోన్ మాట్లాడవద్దన్నారు. మలుపుల వద్ద మెల్లగా వెళ్లాలని అన్నారు. ముందు వెళ్తున్న వాహనానికి కనీసం 50 మీటర్ల దూరంలో వాహనాలు నడపాలన్నారు. అకస్మాత్తుగా బ్రేక్ వేయకూడదని, ఎదురు మార్గంలో బండ్లు నడపకూడదని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివరాజ్, మహేష్, మోయిజ్, సందీప్, అశోక్ పాల్గొన్నారు.

ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షల కొరకు సన్నద్ధమవుతున్న మైనారిటీస్ అభ్యర్థులకు జిల్లాలో ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ దరఖాస్తుల గడువు ఫిబ్రవరి 15వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి ఆర్.మోహన్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్ -4 పరిక్షల కోసం కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పోటీ పరిక్షలు, రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు లాంటి పోటీ పరీక్షల కోసం ఆఫ్ లైన్ ద్వార డిగ్రీ పూర్తి చేసుకున్న మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ 4 నెలలు ఉంటుందని అర్హత, ఆసక్తి కలిగిన మైనారిటీస్ అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, డిగ్రీ మార్క్స్ మెమో, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు (02)తో నూతన కలెక్టర్ ఆఫీసు భవన సముదాయములోని మొదటి అంతస్థు ఎఫ్-3 లోగల జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నాలుగు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-బోథ్

వ్యవసాయ మార్కెట్ పరిధిలోని బోథ్, పొచ్చర, నేరడిగొండ, సొనాల జిన్నింగ్‌లలో పత్తి కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్టు మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సెలవులు ఉండటంతో ఈనెల 12 నుంచి 15 వరకు సీసీఐ కొనుగోళ్ల కేంద్రాల్లో పత్తి కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఈనెల 16 నుంచి యదావిధిగా కొనుగోళు చేపడుతామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-కెరమెరి



సంక్రాంతి ముందస్తు పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలో బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు గాలి పాఠాలు ఎగరవేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న బాలికలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కారస్పాండేంట్ అజయ్, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ఉపాధ్యాయ సిబ్బంది మునీర్, శివాణి, ప్రేమలత, సుమిత్ర, సరిత, గీత, శ్రీదేవి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేసిన అటవీ అధికారులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని చిత్తం, శివపల్లి కోయపల్లి గిరిజనేతరులకు గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు అక్తర్ అహ్మద్, సూర్యారావు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణి చేశారు. అనంతరం ఆయా గ్రమాలల్లో అటవి సంరక్షణ, ఆటవిలో నిప్పు నివారణ, గురించి అవగాహన సదస్సు కార్యక్రమాలు ఏర్పటు చేశారు. కార్యక్రమంలో ఆటవి సిబ్బంది నవ్య బేసు క్యాంపు సిబ్బంది వసంత్ సత్తయ్య ఫారూక్ పృథ్వి గ్రామస్తులు పాల్గొన్నారు.

నిషేధిత చైనా మాంజాను అమ్మితే చర్యలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఇస్లావత్ నరేష్ అన్నారు. చైనా మంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉంధని చైనా మాంజాతో నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైనా మాంజాను అమ్మినా, రవాణా చేసినట్లు తెలిస్తే మాకు సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని డీఈఈ జీవరత్నం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. విధి నిర్వాహణలో భాగంగా పనులు నిర్వహించినప్పుడు భద్రత నియమాలు పాటించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పనులు విద్యుత్‌కు సంబంధించిన పనులు చేసే సమయంలో ప్రమధాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ ఉపకేంద్రంలో సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యుత్ ఉప కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈ రమేష్, సీనియర్ లైన్మెన్ కుమారస్వామి, లైన్ ఇన్స్‌పెక్టర్ అలాం, ఆత్రం సన్మాన్ రావు, రవి, జగదీశ్, జహీర్ పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-తిర్యాణి

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టీయూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను తహసీల్దార్ సూర్యప్రకాష్‌రావు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం టీయూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గేడం జనార్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని, పెండింగ్ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీఆర్‌టీ, సమగ్ర శిక్షణ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోమ్మెన భరత్, టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు కొట్నాక ప్రవీణ్ కుమార్, సభ్యులు దేవుషా, నగేష్, రామారావు పాల్గొన్నారు.

ఫోటో గ్రాఫర్ల మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని బుద్ధ విహార్ ప్రాంగణంలో శుక్రవారం ఫోటో గ్రాపర్ల మండల కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాడీ నాగేష్ ఉపాధ్యక్షుడిగా పెరుగు రాజు, కార్యదర్శులుగా జుమ్డి రాజు, దంద్రె జితెందర్, కార్యవర్గ సభ్యులుగా నీలం నాందేవ్, రాచకొండ శ్రీనివాస్, అగాడి జీవన్, కామ్రె నారాయణ, జుమిడి శంకర్ ఎన్నికయ్యారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

నవతెలంగాణ-పెంచికల్ పేట్

మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన చిన్నబోయిన మహేష్‌కు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ అందజేశారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి చెక్కులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కుకుడే రాజేష్, ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు సిర్పురం బీమయ్య, బీజేపీ ముఖ్య నాయకులు దుర్గం శోభన్, శ్రీకాంత్, అనంతరావు పాల్గొన్నారు.

తెలంగాణ ఉపాధ్యాయ బృందానికి ప్రశంసలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో కేంద్ర సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న బొమ్మల ద్వారా విద్యాబోధన అంశంపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉపాధ్యాయ బృందం అద్భుత ప్రతిభను కనబర్చింది. ఈ బృందం జానపద కళారూపాన్ని ప్రదర్శించి ఏడు రాష్ట్రాల ఉపాధ్యాయులతో పాటు సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ (అస్సాం) నిరంజన్ భూయాన్ ప్రశంసలు అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కెవి సబ్‌స్టేషన్‌ల నెలవారీ మరమ్మత్తుల కారణంగా ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శబరిమల బయల్దేరిన అయ్యప్ప భక్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణానికి చెందిన అయ్యప్ప భక్తులు శుక్రవారం శబరిమల బయల్దేరారు. ఉదయం అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టిన అనంతరం గురుస్వామి భిక్షపతి ఆధ్వర్యంలో శబరిమల యాత్రకు బయల్దేరారు. వారికి రైల్వేస్టేషన్‌లో భక్తుల కుటుంబసభ్యులు భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.

హైమన్‌డార్ఫ్ వర్ధంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో నేడు జరిగే హైమన్ డార్ఫ్ వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ భూషణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో హైమన్ డార్ఫ్ వర్ధంతికి వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్‌రావు, కుర్సంగ దందు, సిడాం ధర్ము, ఆత్రం భీంరావ్, కుంరం భీంరావ్, ఆత్రం రాము పాల్గొన్నారు.

ఆశాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆశా కార్యకర్తల సమస్యలను రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ప్రస్తావించి పరిష్కారానికి ఎమ్మెల్యేలు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ర్యాలీగా ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి అక్కడ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతేడాది సెప్టెంబర్ నుండి 16 రోజులు నిరవధిక సమ్మె చేపట్టారని, తర్వాత కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా కూడా చేసినట్లు తెలిపారు. అయినా వారి సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని అన్నారు. వీరి సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే రానున్న బడ్జెట్ సమావేశాలలో ప్రస్తావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు





వెలిశాల కృష్ణమాచారి, యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మ, జిల్లా కమిటీ సభ్యులు మొగ్రా, కేసరి, నిర్మల, శిరీష, ప్రమీల, మమత, శకుంతల, శారద, సుమలత, లక్ష్మి మీనతి, సురేఖ, స్వరూప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ముట్టడి

మంచిర్యాల : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు శుక్రవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారం హామీలకే పరిమితం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందని, ఎన్నో సార్లు నిరసనలు చేపట్టినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.18000 జీతంతో పాటు జాబ్ చార్ట్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శోభ, సమ్మక్క పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దిందా హై లెవల్ వంతెనకు పూర్తి స్థాయి అనుమతులు

- త్వరలోనే నిర్మణపనులు ప్రారంభం : ఎమ్మెల్సీ దండే విఠల్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

దిందా గ్రామ ప్రజల చిరకాల స్వప్నం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తీరుతుందని శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మండలంలోని దింద, కేతినీ గ్రామ వంతెనాను సందర్శించి పరిశీలించారు. ఏళ్ళుగా ఎదురు చూస్తున్న, ఫారెస్ట్ అనుమతులు లేక నిలిచిన దిందా వాగు హై వంతెన పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు లేకుండా అనుమతులు మంజూరు చెయ్యడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామాలకు తాగునీరు, విద్యుత్, విద్య వైద్యం రవాణా వసతి కల్పించాలని ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి, మాజీ ఎంపీపీ డుబ్బుల ననాయ్య,



బసర్కార్ విశ్వనాథ్, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు ఉమా మహేష్, ప్రసాద్, బింకరి నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు, యూనియన్లు మారినా పరిష్కారంకాని సమస్యలు



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వాలు, యూనియన్లు మారినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావట్లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మందమరి బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటస్వామి, అల్లి రాజేందర్ ఆధ్వర్యంలో శాంతి ఖని గనిలో కార్మికులను కలుసుకొని సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఅండ్ఎండితో డిసెంబర్‌లో స్ట్రక్చరల్ సమావేశం ఏర్పాటు చేస్తానని ఇప్పటివరకు ఏర్పాటు చేయకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. ఆర్థిక సమస్యలను పరిష్కరించడం ఇష్టం లేకనే స్ట్రక్చర్ కమిటీ సమావేశాన్ని ఇప్పటివరకు జరపకుండా వాయిదా వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా, గుర్తింపు సంఘం మారినా కార్మికుల సమస్యలు మాత్రం తీరలేదని పేర్కొన్నారు. ఓట్లేసి గెలిపించిన కార్మికులు సొంతింటి పథకం అమలు కాకుండా దీనంగా దిగిపోతున్నారన్నారు. బ్యాంకులో రికవరీ చేసుకోమని కార్మికులు ఇచ్చిన సంతకాల స్లిప్పులను యాజమాన్యం చూడకుండా రికవరీ చేసిన విధానాన్ని తప్పు పడితే ఏఐటీయూసీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సొంతింటి కల ఏ విధంగా సహకారం చేయవచ్చో అర్థమయ్యేలా కరపత్రం ద్వారా కార్మికులకు, అధికారులకు, ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళ్లామని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షంగా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు గెలిచిన సంఘంపై ఒత్తిడి తీసుకువస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ అబ్బోజి రమణ, జడల ప్రవీణ్, నాగరాజు, బుద్ధ సురేష్, ధనిశెట్టి సురేష్, దేవదాసు, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్ పాల్గొన్నారు.

నేడు జీఎం కార్యాలయం ఎదుట ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం జీఎం కార్యాలయం ఎదుట జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ సివిల్ డిపార్ట్మెంట్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి సంస్థలో 33వేల మంది పైచిలుకు కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందన్నారు. ఒకే కుటుంబం ఒకే లక్ష్యం ఒకే గమ్యం అని చెప్పుకునే సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియాలో అమలవుతున్న హైపర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని, ఈ వేతనాలు అమలయ్యేంత వరకు,



జీవో నెంబర్ 22 ప్రకారం వెంటనే వేతనాలను చెల్లించాలని, ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలని, 2022 సెప్టెంబర్ నెలలో 18 రోజుల సమ్మె సందర్భంగా యాజమాన్యం ఏఎల్సీ సమక్షంలో అంగీకరించిన ఒప్పందాలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్, ఖాతరాజు ప్రభాకర్, కార్యదర్శి బూర వీరేశం, సహాయ కార్యదర్శి చారి, సమ్మయ్య పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను శుక్రవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పశువులతో వెళ్తున్న రెండు బొలోరో వాహనాలను ఎస్ఐ ప్రశాంత్, ఏఎస్ఐ పోశెట్టి పోలీస్ సిబ్బందితో కలిసి చాకచక్యంగా పట్టుకున్నారు. అనుమతులు లేకుండా రెండు బొలోరో వాహనాలలో మహారాష్ట్ర వైపు నుండి హైదరాబాద్‌లో విక్రయించేందుకు 25 పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద పశులకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో బొలోరో వాహనం ఎంహెచ్ 32 ఏజె 5524లో అక్రమంగా రవాణా చేస్తున్న మహారాష్ట్రకు చెందిన వ్యాపారి శర్డే వికాస్, జడ్స్ మొంటూ, సలీం ఖురేషీ, మరో వాహనం టీఎస్ 18 టి 4386 వాహనంలో షేక్ అస్లం, సులేమాన్, ఆసిఫ్ అనే ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ



తెలిపారు. పట్టుకున్న ఎనిమిది ఆవులు, 17 ఎద్దులు మొత్తం 25 పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై మధ్యాహ్న భోజన కార్మికుల రాస్తారోకో

నవతెలంగాణ-తాండూర్



తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాజారాం మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఏడాదైనా అమలు చేయడం లేదని తెలిపారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కోడి గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, వంట షెడ్లు, వంట పాత్రలు అందజేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రత కల్పించాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మల్లక్క, శారద, వరలక్ష్మి, కవిత, శంకరమ్మ, లక్ష్మి, దుర్గం నానయ్య, వేల్పుల శంకర్, బాలేష్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన ఈ పోటీలలో 128 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గుల పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 26 రిపబ్లిక్ డే వేడుకలలో బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దయాకర్, ఎ.శ్రీనివాస్, జయశ్రీ, దేవి, అనిత, మాధవి, అనుపమ, కల్పలత పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షునిగా తుకారాం

నవతెలంగాణ-కెరమెరి

బీజేపీ మండల అధ్యక్షుడుగా తుకారాం సెడ్మకి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మండలం అధ్యక్షుడి ఎన్నిక ప్రకటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న తుకారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తుకారాం మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల అధ్యక్ష పార్టీ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్ష, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో మండల విద్యార్థికి 3వ స్థానం

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సాయి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో 3వ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం విద్యార్థిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు రామగిరి రాము, మండల ప్రధాన కార్యదర్శి రామగిరి మధు, ఎమ్మెఎస్ఎఫ్ నాయకులు జలంపల్లి ప్రశాంత్, రామగిరి రాకేష్, ఇరిగిరాల రవితేజ, అరుణ్ పాల్గొన్నారు.

రుద్రపూర్ పాఠశాలలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని రుద్రపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీనికి మండల విద్యాధికారి జయరాజ్ హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటలతో పాటు ఉన్నత చదువులు, ఉద్యోగ సాధనపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు క్రీడల్లో కూడా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ దుర్గం రవికుమార్, ఉపాధ్యాయ బృందం నాయకులు నిస్తూరి సత్యన్న పాల్గొన్నారు.

పరిహారం చెక్కు పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో పులి దాడిలో మృతి చెందిన ఆవు యాజమానికి శుక్రవారం అటవీ అధికారులు నష్టపరిహారంకు సంబంధించిన చెక్కును అందించారు. డివిజన్ పరిధిలోని సిర్పూరు (టి) మండలం చీలపల్లి గ్రామస్థుడు గంగుల శంకర్‌కు చెందిన ఆవు ఇటీవల పులి దాడిలో మృతి చెందింది. దీనికి సంబంధించిన పరిహారం రూ. 8,000 మంజూరు కాగా ఆ చెక్కును శుక్రవారం యాజమాని గంగుల శంకర్‌కు కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ బోబడే సుశాంత్ సుఖ్‌దేవ్ అందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్ఆర్ఓ శశిధర్‌బాబు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లపై దాడి చేసిన యువకుల రిమాండ్

నవతెలంగాణ-కౌటాల

ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడి చేసిన ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..నాగెపల్లి గ్రామానికి చెందిన గుర్లే అజయ్, కార్తిక్ స్నేహితులు. బుధవారం సాయంత్రం కన్నేపల్లిలో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా యాపలగూడ గ్రామానికి చెందిన చాపిడి రాజేశ్వర్, చాపిడి తులసీరాం వీరి బైక్‌ను అడ్డగించి దాడి చేశారు. అజయ్ డయల్ 100కు ఫోన్ చేశాడు. డ్యూటీలో ఉన్న సివిల్ కానిస్టేబుల్ సాయిరాజ్ గౌడ్, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ అజయ్‌తో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. గొడవ ఆపేందుకు ప్రయత్నించగా రాజేశ్వర్, తులసీరాం కానిస్టేబుళ్లను నెట్టివేసి దాడి చేశారు. ఎస్ఐకి సమాచారం ఇవ్వగా సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు విధులకు ఆటంకం కల్గించిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

భార్య కాపురానికి రావడం లేదని మండల కేంద్రానికి చెందిన కావేరి శేఖర్(34) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శేఖర్‌కు రెండు సంవత్సరాల క్రితం పెళ్లి అయింది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య రెండు నెలల నుంచి కాపురానికి రావడం లేదు. మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లోనే దూలానికి ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అటవీ అనుమతులపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఉపరితల గని విస్తరణలో భాగంగా అటవీ అనుమతులపై శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణతో ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ సర్వేశ్వరరావు శుక్రవారం జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీరాంపూర్ ఉపరితల గని విస్తరణలో భాగంగా 164 హెక్టార్ల అటవీ భూమికి అనుమతులు రావడం జరిగిందని, అటవీ అనుమతులతో ఉపరితల గని ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఫారెస్ట్ అధికారి చంద్రమణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ పాల్గొన్నారు.

విలేకరికి ఎంపీ వంశీకృష్ణ పరామర్శ

నవతెలంగాణ-నస్పూర్



ప్రముఖ దిన పత్రిక మంచిర్యాల రిపోర్టర్ సీహెచ్ జనార్ధన్ రోడ్డు ప్రమాదంలో గాయ పడగా శుక్రవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. క్షేమ సమాచారం తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తెలియ జేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పున్నంయాదవ్, జైనోద్దీన్, పడుగ రాజన్న, మద్ది సాయినాథ్, అనిల్, సాగర్, భిక్షపతి, విజయ్, రాజమల్లు, శ్రీనివాస్, అజయ్, సంతోష్, రవి, భార్గవి, రజిత, వాణి, నాగమణి పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు ప్రశంస

నవతెలంగాణ-మందమర్రి

జాతీయ అవార్డు గ్రహీత దాసరి శ్రావణ్‌ను రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ అభినందించారు. శ్రావణ్ చేసిన సామాజిక సేవలకు గాను బహుజన సాహిత్య అకాడమీ సంస్థ వారిచే ఇటీవల అంబేద్కర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. సీపీ మాట్లాడుతూ మందమర్రి పోలీస్‌స్టేషన్ హోంగార్డుగా ఉద్యోగాన్ని నిర్వహిస్తూనే సమాజ సేవలు, బ్లడ్ డొనేట్ క్యాంప్, సామాజిక సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ అంబేద్కర్ జాతీయ స్థాయి అవార్డును అందుకోవడం అభినందనీయమని కొనియాడారు. విధులు నిర్వహిస్తూ ప్రజా సేవలు చేస్తున్నందుకు శ్రావణ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, ఏసీపీ సుందర్, ఆర్ఐ దామోదర్, ఎంటీఓ ఆర్ఐ సంపత్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ, గ్రామపంచాయతీ పరిధిలోని పాపన్నగూడ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్82/1లో ఉన్న 20 ఎకరాల భూమిని నిరుపేదలకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నాయకులు, నిరుపేదలతో కలిసి జన్నారంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజామనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆ గ్రామాల్లో ఇండ్లు లేని నిరుపేదలకు ఆ భూమిని ఇచ్చి అక్కడ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సుమారు 200 కుటుంబాలు పేదరికంలో ఉన్నాయన్నారు. ఆ భూమిలో వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి పురం శెట్టి బాపు పాల్గొన్నారు.

దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌కు దేవాపూర్ డీఏవీ విద్యార్థి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లోని డీఏవీ పాఠశాల 9వ తరగతి విద్యార్థి వై సాయి శోభిత్, సైన్స్ ప్రాజెక్ట్ ప్రతిష్టాత్మకమైన దక్షిణ భారత సైన్స్ ఫేర్‌కు ఎంపికైందని ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శణ 2024-25 మొత్తం 400 సైన్స్ ఫేర్ ప్రాజెక్టలలో డీఏవీ పాఠశాల నుంచి మూడు విశేషమైన ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో అత్యున్నత పురస్కారాలు సాధించింది రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు 7వ తేదీ నుంచి మహబూబ్ నగర్‌లోని జెడ్చర్లలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో సాయి శోభిత్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైంది. దక్షిణ భారత సైన్స్ ఫేర్ జనవరి 20న పుదుచ్చేరిలో జరగాల్సి ఉండగా ఎంపికైన విద్యార్థి పాల్గొననున్నారు.

నేడు ఒడ్డే ఓబన్న జయంతి వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్

కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉదయం10.30 గంటలకు ఒడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు ప్రజలు, సంఘాల నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాముని చెరువును పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో గల రాముని చెరువుని శుక్రవారం తహసీల్దార్ రఫతుల్ల హుస్సేన్ మంచిర్యాల మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. గత కొన్నిరోజులుగా రాముని చెరువు కబ్జాకు గురైందని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలోకలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు చెరువును పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఎఫ్ టి ఎల్ పరిధిలో చుట్టు పక్కల వారు చేత్తను వేయడంతో చెరువులోని నీరు కలుషితమవుతుందన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద పౌర సేవ సంస్థ సభ్యులు పాల్గొని చెరువును ఆనుకొని వేసిన అక్రమ రోడ్డు, నిర్మాణాలు, చెరువులోని మురుకి నీరు చేరకుండా సీవరేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మంచి నీటితో కూడిన చెరువు ప్రజలకు అందించేలా చూడాలని అధికారులను కోరారు. విచారణ అనంతరం పూర్తి నివేదిక కలక్టర్‌కు అందిస్తామని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్‌లతో పాటు స్వచ్ఛంధ పౌర సేవ సంస్థ సభ్యులు తులా మధు సుధన్, కనుకుంట్ల మల్లయ్య, రంగు రాజేశం పలువురు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.హరీష్ రాజ్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో మాత శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణ రూపొందించి చర్యలు చేపడుతున్నట్టు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అర్మాన్ సంస్థ ద్వారా ఆరోగ్య కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అర్మాన్ సంస్థకు చెందిన డా సౌజన్య, డా అనిల్, ప్రశాంత్ కుమార్, భాస్కర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ గర్భం దాల్చిన మహిళలు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో వివరాలు నమోదు చేసుకుని సమయానుసారంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని అవసరమైన మందులు, పౌష్టిక ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిలను శక్తివంతం చేయడానికి, ఆరోగ్యవంతమైన పిల్లల ఎదుగుదలకు, మాత శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవ పూర్వ రక్త స్రావం, మధుమేహం, మూర్ఛ, కామెర్లు, గుండె జబ్బుతో గర్భధారణ, గర్భధారణలో ఊపిరి సరిగా అందకపోవడం, క్షయ, జ్వరము, పిండం ఎదుగుదల పరిమితి 20 వారాల ముందు రక్తస్రావం అవడం, నెలలు నిండకుండా గర్భస్రవం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో మాత శిశు మరణాలను నియంత్రించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా కృపాబాయి, ప్రోగ్రాం అధికారులు డా ఎస్ అనిత, డా సీతారామరాజు, డా ప్రసాద్, డా అనిల్, మాస్ మీడియా అధికారి ఒక్క వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌ను కట్టడి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

కరోనా వైరస్ వ్యాప్తితో దేశమంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, అలాంటి వైరస్ హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందుతుందని దానిని ముందస్తు కట్టడి చేయాలని డాక్టర్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో ఉద్యోగులకు వైరస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైరస్ ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులను త్వరగా ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నందున ఒకే దగ్గర ఎక్కువమంది ఉండే ప్రదేశాలు గుమి కూడకుండా ఉండేలాగా చూసుకొని వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలన్నారు. శానిటైజర్స్, సబ్బుతో తరచుగా చేతులను శుభ్రపరచుకోవడం, తుమ్మినప్పుడు దగ్గినప్పుడు వచ్చే తుంపర్లు దుస్తువులు ఇతర వస్తువుల మీద పడకుండా చేతిని లేదా రుమాలుని అడ్డుపెట్టుకోవడం చేయడం వలన ఈ యొక్క వైరస్ ని అడ్డుకట్ట వేయవచ్చు అని అన్నారు.ఈ కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి సంతోష్ రావు, ఏఐటీయూసీ నాయకులు పిట్ సెక్రటరీ మారేపల్లి సారయ్య, బానయ్య, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీష్ రావు, అండర్ మేనేజర్లు రవీందర్, రాము, బాలకృష్ణ, రాజు, ఇంజనీర్లు ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్(యూజీసీ) వీసీలను నియమించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేకుండా గవర్నర్లకు అధికారం ఇవ్వాలని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన నాయకుల సమావేశంలో తిరుపతి మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ నియామకం కోసం సవరించిన నిబంధన రాష్ట్రాల హక్కులను హరిస్తుందని తెలిపారు. రాష్ట్రాల హక్కులను హరించడం అంటే రాజ్యాంగ విలువలను హరించడమేనని అన్నారు. వీసీలను నియమించే అధికారం మొత్తం కూడా గవర్నర్లకు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. గవర్నర్లకు అధికారం ఇస్తే వారి ఇష్టం ఉన్న వ్యక్తులను నియమించుకునే అవకాశం ఉంటుందని ఆరోపించారు. వీసీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం లేకుండా చేయడం అనేది సరైన పద్ధతి కాదని, కేంద్ర ప్రభుత్వం ఈ విధానం తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలలో వారి ఆధిపత్యాన్ని చలాయించే వ్యక్తులను నియమించుకొని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే విధంగా పనిచేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ అన్ని వర్గాల వారు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలి



నవతెలంగాణ-తాండూర్

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. పత్తి రైతుల ఆందోళన విషయమై ఆయన శుక్రవారం మహేశ్వరి జిన్నింగ్ మిల్లులో రెవెన్యు శాఖ, మార్కెటింగ్ శాఖ రికార్డులను పరిశీలించారు. సీసీఐ అధికారులు భాధ్యత యుతంగా విధులు నిర్వహించాలని రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. టోకెన్ల పంపిణీ విషయంలో అవకతవకలకు పాల్పడరాదని తెలిపారు.

ఈ నెల 15 వరకు పత్తి కొనుగోలు బంద్

శనివారం నుంచి ఈ నెల 15 వరకు సంక్రాంతి పండుగ సందర్భంగా మార్కెట్ కమిటీ బెల్లంపల్లి పరిధిలో గల (02) జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోళ్లు నిలిపివేసినట్లు మార్కెటింగ్ అధికారి భాస్కర్ తెలిపారు. జిన్నింగ్ మిల్లులలో పత్తి బేళ్ళు, గింజల నిలువలు ఉనందున నిలిపివేసినట్లు తెలిపారు. తిరిగి 16 తేదీ గురువారం నుంచి యదవిదిగా కొనుగోలు జరుగుతాయని తెలిపారు. రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు.

సెయింట్ థెరిసా హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-తాండూరు

మండలం రేపల్లెవాడలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ గ్రామీణ నాగరికత వేషధారణలో గ్రామాలలో గ్రామీణ మహిళలు, రైతులు గంగిరెద్దులు, హరిదాసు, వివిధ వేషధారణలతో అలరించారు. ప్రిన్సిపాల్ అంటోనీ మాట్లాడుతూ విద్యార్థులందరూ మన నాగరికతను సంప్రదాయాలను ఆచార వ్యవహారాలను గౌరవించాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థి విద్యార్థులందరికీ భోగి పండ్ల పూజ చేయించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలురకు గాలి పటాలు ఎగురవేసే కార్యక్రమం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకి బహుమతుల అందజేశారు. పాఠశాలలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భోగి మంటల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జోష్ సార్, స్టాఫ్ సెక్రటరీ సిస్టర్స్ సార, కేజీ ఇన్‌చార్జి సిస్టర్ రెన్సి పాల్గొన్నారు.



రాంపూర్‌లో ఘనంగా వైకుంఠ ఏకాదశి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న పలు దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శుక్రవారం రామాలయంలో పలు గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లోని స్వామి, అమ్మవార్లను వేద పండితులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా దేవాలయాల్లో ఉన్న ఉత్తర ద్వారాల గుండా భక్తులు దేవాలయాల్లోకి వెళ్లి స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు.

కనులపండువగా ముక్కోటి ఏకాదశిపూజలు

మండలంలోని రాంపూర్ గ్రామంలో గల శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం ముక్కోటి ఏకాదశి పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఏకాదశి సందర్భంగా స్వామివారికి పల్లకీ సేవను నిర్వహించి, భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామి వారు రంగనాథ స్వామి రూపంలో శ్రీదేవి భూదేవి సమేతంగా దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకొని భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఆలయ పూజారి నవీన్ స్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌కు ఎంపికైన మోడల్ స్కూల్ టీచర్

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ ఈవెంట్‌కు ఎంపికయ్యాడు. ఈ ఈవెంట్ మధ్యప్రదేశ్ రాష్ట్రం బరహన్పూర్లోని మాక్రో విషనరీ అకాడమీలో జనవరి 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ఈవెంట్లో సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్ క్విజ్, సైన్స్ టీఎల్ఎం, రోల్ ప్లే సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ప్రదర్శించనున్నారు. దేశం నలుమూలల నుండి ఎంపికైన స్టూడెంట్స్ తమ గైడ్ టీచర్ సహాయంతో వివిధ అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శిస్తారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్లో ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ తన సైన్స్ టీఎల్ఎంను ప్రదర్శించనున్నారు. ఇలాంటి ఈవెంట్లో అవకాశం రావడం గర్వంగా ఉందని ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ పేర్కొన్నారు. ఇదే సైన్స్ ఉపాధ్యాయుడు ఇండియన్ సైన్స్ ఫెస్టివల్కు కూడా ఎంపికయ్యాడు. ఈ రెండు సైన్స్ ఈవెంట్లకు ఎంపిక పట్ల డీఈవో యాదయ్య, ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం



నవతెలంగాణ-జన్నారం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మండల కేంద్రానికి చెందిన సయ్యద్ ఫసీఉల్లాను స్థానిక మహమ్మదీయ మసీదులో మైనారిటీలు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో అనేక ఉన్నతమైన పదవులు పొంది మంచి పేరు సంపాదించాలన్నారు. ముఖ్యంగా మైనారిటీలను గుర్తించి వైస్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ మోయినొద్దిన్, ఉపాధ్యక్షుడు సాబీర్ పాషా, మాజీ ఎంపీటీసీ ఎండీ రియాజుద్దీన్, పీఏసీఎస్ డైరెక్టర్ సాదుపాషా, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎంఏ రజాక్, పొనకల్ మాజీ ఉప సర్పంచ్ మోసిన్ షా ఖాన్, రియాసత్ అలీ, సుల్తాన్, ఫసియుద్దీన్, ఎంఏ రషీద్, ఎస్‌కె కాజా మొయినద్దీన్, బషారత్ అలీ, ఎస్‌కె ఇమ్రాన్, ఎండీ ఆరిఫ్, పాషా పాల్గొన్నారు.

ఘనంగా ఇంటర్ కార్మల్ స్పోర్ట్స్ మీట్




నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట మౌంట్ కార్మల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 11వ ఇంటర్ కార్మల్ స్పోర్ట్స్ మీట్-2025 ఘనంగా నిర్వహించారు. గుడిపేట బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్పాండే చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్లో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని కార్మల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వివిధ రకాల క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో ఫాదర్ జోష్, గుడిపేట పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఆల్ఫీ, సీఎంసీ సిస్టర్స్, తెలంగాణలోని కార్మల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అండర్ గ్రౌండ్ ఉద్యోగులు 10 కన్న తక్కువ మాస్టర్లు, సర్ఫెస్ ఉద్యోగులు 20 మాస్టర్లు కన్నా తక్కువ డ్యూటీలు చేసిన ఉద్యోగులకు మేనేజర్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. గైర్హాజరు వల్ల కంపెనీకి, ఉద్యోగుల కుటుంబాలకు జరిగే నష్టాన్ని ఉద్యోగులకు గని మేనేజర్ జి.లక్ష్మీనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, సంక్షేమాధికారి కే భార్గవ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | జనవరి 11, 2025 | www.navatelangana.com

కదిలిని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



దిలావర్‌పూర్ మండలంలోని మాడేగాం అనుబంధ గ్రామమైన కదిలిని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఆ గ్రామస్తులు డీసీసీ అధ్యక్షులు కె.శ్రీహరిరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి గ్రామపంచాయతీ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. డీసీసీని కలిసిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మెన్ భీమ్‌రెడ్డి, నాయకుడు పాల్దే అనిల్, దేవేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, లింగారెడ్డి ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్



విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు శుక్రవారం మండలంలోని పాట్నపూర్ గ్రామ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులను చదువులో తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వేకువజాము నుండే ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. ముక్కోటి ఏకాదశి, స్వర్గద్వార ఏకాదశిగా సైతం పిలవబడే వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాసం ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. పురాణాల్లో అత్యంత విశిష్టత కలిగిన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు వేకువజాము నుండే భక్తి శ్రద్ధల నడుమ స్వామివారిని దర్శించుకున్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ మండలంతో పాటు పట్టణంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పద్మావతినగర్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ చక్రపాణి నరసింహమూర్తి భక్తులకు పండుగ విశిష్టతను గురించి వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు కడార్ల గంగ నర్సయ్య, తోట సత్యం, డాక్టర్ రాము, డాక్టర్ కిరణ్ కుమార్, అర్చకులు సందీప్‌శర్మ భక్తులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : సోన్ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉదయం నుండే అధిక సంఖ్యలో హాజరై, స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

11 నుంచి17 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు ఈనెల 11 నుంచి సంక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని డీఈఓ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాడమిక్ క్యాలెండర్‌లో ఈనెల 13 నుంచి 17 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఈనెల 11న రెండో శనివారం, 12న ఆదివారం కావడంతో అదనంగా రెండు రోజులు సెలవులొచ్చాయి. దీంతో ఏడురోజులపాటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. 18న అన్నీ పాఠశాలల్లో తిరిగి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఖానాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కొరకు శనివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని ఖానాపూర్, సోనార్‌గల్లీ, బొక్కలగూడ, కొలీపుర, మసూద్‌చౌక్, ధంగార్‌గల్లీ, శాంతినగర్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని పేర్కొన్నారు.

లక్షెట్టిపేట : విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ గణేష్ తెలిపారు. 33/11 వెంకట్రావుపేట్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కొరకు శనివారం ఉదయం 10-30 నుండి మధ్యాహ్నం 12-00 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని వెంకట్రావుపేట్ దౌడపల్లి, కొమ్ముగూడెం, ఎల్లారం, చందారం, కొత్తూరు, హనుమంతుపల్లి, రంగపేట్ గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించగలరని తెలిపారు.

జైపూర్ : జైపూర్ మండల కేంద్రంలో గల 33 కేవీ సబ్ స్టేషన్‌తో పాటు ఇందారం గ్రామంలో గల 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయానికి వినయోగదారులు సహకరించాలని స్థానిక ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మత్తు పనుల కారణంగా ఇందారం, జైపూర్ సబ్ స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

పండుగ కుటుంబ సభ్యులతో జరుపుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

మకర సంక్రాంతి పండుగ సెలవులను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాలని భీమారం ఎస్సై శ్వేత సూచించారు. శనివారం నుండి పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక కస్తూరిబా పాఠశాల విద్యార్థినులతో సమావేశమైన ఆమె ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులకు దూరంగా ఉండటం శ్రేయస్కరమని హెచ్చరించారు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే పోస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. షీ టీమ్ సభ్యులు, 100 నెంబర్‌కు డయల్ చేసిన సమాచారం అందించాలని సూచించారు. పాఠశాల నుండి ఇంటికి వెలుతున్న విద్యార్థులు స్థానికంగా సమస్యలకు దూరంగా ఉండటం అవసరమని సూచించారు.

రేపు స్వామి వివేకానంద జయంతి వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్

కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు యువజన క్రీడా శాఖ అధికారి కీర్తిరాజ్‌వీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువజన సంఘాల సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు, క్రీడాకారులు, సంఘాల నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిళ తరంగిణి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని రంగంపేటలో శుక్రవారం మంచిర్యాలకు చెందిన మమతా మహిళా తరంగిణీ అధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలను ఉత్తేజ పరిచేందకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు మమతా సభ్యురాలు రాచకొండ మంజుల తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలలను అభినందిస్తూ పోటీల్లో గేలిచిన మహిళలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మమతా మహిళా తరంగిణి సభ్యులు లతా, నాగమణి, సునీత, జ్యోష్న చంద్రదత్, సత్య ప్రియా పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీల నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులతో ముగ్గులు వేసి బహుమతులను గెలుచుకుంటున్నారు. ప్రత్యేకంగా తిమ్మాపూర్ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు. అలాగే మండలంలోని కలమడుగు వివేకానంద ప్రయివేట్ పాఠశాలలో ప్రిన్సిపల్ అమరగొండ సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.

12న స్లేట్ పాఠశాలలో ముగ్గుల పోటీలు...

సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 12వ తేదీ ఆదివారం రోజున పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓల్డ్ స్లేట్ హైస్కూల్లో రంగవల్లి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందచేయబడునని అన్నారు. అవకాశాన్ని మహిళలు యువతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియాలోని విశ్వశాంతి హై స్కూల్‌లో సంక్రాతి పండుగ పురస్కరించుకొని శుక్రవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. తెలుగు సాంస్కృతి, సాంప్రదాయం ప్రతిబింభించేలా సామజిక అంశాలపై చైతన్యం కలిగించేలా మహిళలు వేసిన ముగ్గులు చూపరులను కట్టిపడేశాయి. మొదటి బహుమతి శోభ, రెండవ బహుమతి అనూష, మూడవ బహుమతి స్రవంతి అందుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రమేష్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ, ముగ్గుల విశిష్టతను తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన పంటలో ప్రకృతిలోని జీవరాశికి కొంత అర్పించే పండగ సంక్రాతి అని వివరించారు. రైతులందరు ఎల్లప్పుడూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాహీదా పాల్గొన్నారు.

తాండూర్ : బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ భోగి మంటలను వెలిగించి ఉత్సవాలను ప్రారంబించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భోగి సంక్రాంతి పండగ యొక్క విశిష్టతను వివరించారు. విద్యార్థిని విద్యార్థులు వివిధ వేషధారణతో వచ్చి, గాలి పటాలను ఎగురవేసి ఆనందంలో నిమగ్నమైపోయారు. విద్యార్థిని విద్యార్థులకు రంగోలి (ముగ్గుల) పోటీలను నిర్వహించి, విద్యార్థులకు భహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఈ.రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.రాజా రమేష్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ :వశిష్ట ఇంపల్స్ ఈ టెక్నో స్కూల్ ఆదర్శ్ నగర్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు భోగి పండ్లు పోయడం, గాలిపటాలు ఎగురవేయడం, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను ఆచరిస్తూ వాటిని భవిషత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే రంగోలి పోటీల్లో గెలుపొందిన విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ గొల్లపల్లి మాధవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దేవిదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ విజేత పాఠశాలలో ముందస్తుగా సంక్రాంత సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి, ముగ్గులు వేస్తూ పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. హరిదాసుల వేషధారణతో విద్యార్థులు పాఠశాలకు రాగా సాంప్రదాయ నృత్యాలతో చిన్నారులు అలరించారు. భోగి పండుగ సందర్భంగా భోగి మంటలను వేసి వాటి చుట్టూ నృత్యాలు చేశారు. సంక్రాంతి ముందస్తు సంబరాలను చిన్నారులు జరుపుకోవడంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. బాలురు గాలిపటాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల విశిష్టత సాంప్రదాయాలు సంస్కృతి గురించి అర్థమయ్యేలా వివరించడం కోసమే ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.





మల్టీపర్పస్ కేంద్రాల నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్, కొలంగూడా, నర్సాపూర్, సోనాపూర్ గ్రామాల్లో కేంద్ర నిధులతో నూతనంగా నిర్మించనున్న మల్టీపర్పస్ కేంద్రాల నిర్మాణానికి శుక్రవారం ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. అనంతరం నర్సాపూర్ గ్రామానికి చెందిన శంకర్‌కు కిరణాషాపు కొరకు ట్రైకార్ లోన్ రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యలు, గ్రామాలాభివృద్దే ధ్యేయంగా పని చేస్తామని ఎలాంటి సమస్యలు ఉన్నా, నియోజకవర్గాల వారిగా అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు చంద్రకాంత్, స్వామి, వెంకటేష్, కేదారేశ్వర్‌రెడ్డి, ఎల్టి శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, గంగాధర్, సుదర్శన్ రెడ్డి, గజానన్, అభిరామ్‌రెడ్డి, రమాకాంత్, డీఈ సతీష్, ఏఈ శంకర్‌రావు, ఎంపీఓ వినోద్, కార్యదర్శి అనిల్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

తాంసి : కొలాంవాడి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.60లక్షల నిధులతో మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి శుక్రవారం మండలంలోని లింగూడ గ్రామంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్ పథకం ప్రవేశపెట్టి ఈ దేశంలో ఉన్న కొలాం గిరిజన కుటుంబాల అభ్యున్నతి కోసం మల్టీ పర్పస్ కేంద్రాల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కొలాం గిరిజన ప్రాంతాల్లో త్రీపేజ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం, రూ.2లక్షల 50 వేలతో ఇండ్ల నిర్మాణాలు పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ పిల్లలకు పోషణ అభియాన్ వైద్య సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అనేక రకాల సదుపాయాలు మల్టీపర్పస్ సెంటర్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజు బీఆర్ఎస్, బీజేపీ మండల నాయకులు వినోద్‌రెడ్డి, నారాయణ, కృష్ణ, సదానందం, అశోక్, పరమేష్, మండల నాయకులు పాల్గొన్నారు.



ధర రాకపోవడంతో వేలం పాట వాయిదా

నవతెలంగాణ-ముథోల్



మండలంలోని ముధ్గల్ గ్రామ శివారులోని ప్రభుత్వ ఉద్యానవనంలో ఉన్న వెదురు కర్రలను శుక్రవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. అయితే ఈ వేలం పాటలో ఆయా జిల్లాల నుంచి పలువురు వ్యాపారులు పాల్గొన్నారు. అనుకున్నంత ధర రాక పోవడంతో ఈ వేలం పాట వాయిదా వేసినట్టు జిల్లా ఉధ్యాన వన అధికారి బి.వి రమణ తెలిపారు. మరల వేలం వేసే తేదీని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వినయ్‌బాబు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ శివకుమార్, పారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నంద్యా నాయక్, ఎఓ రచన, భైంసా హార్టికల్చర్ అధికారి జావిద్ పాషా, బీట్ అధికారి కృష్ణ, వివిధ జిల్లాల నుంచి వెదురు కొనుగొలుదారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సముందర్‌పల్లి గ్రామ అనుబంధ గ్రామంగా ఉన్న కాండ్లి గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ ప్రజలు శుక్రవారం నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నర్సయ్య, రాజారెడ్డి పాల్గొన్నారు.

స్వామి వారి కళ్యాణానికి రూ.30 వేల విరాళం

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని పోన్కల్ గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించే శ్రీ గోదాదేవి రంగనాథుల కళ్యాణ మహోత్సవానికి మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ విరాళం అందజేశారు. శుక్రవారం ఆయన దేవాలయాన్ని సందర్శించి నిర్వాహకులకు రూ.30 వేల విరాళం అందజేశారు. దీంతో దేవాలయ నిర్వాహకులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉదారత చాటిన మహానాడు యూత్ మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-జన్నారం

మండల కవ్వాల్ గ్రామానికి చెందిన మాల మహానాడు యూత్ అధ్యక్షుడు అంబటి శరత్ ఒక నిండు ప్రాణాన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. కవ్వాల గ్రామానికి చెందిన జాడి వెంకటేష్‌కు నిర్మల్‌లో చికిత్స పొందుతున్నారు. అతనికి ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం ఉందని విషయం తెలుసుకున్న శరత్ నిర్మల్ ఆస్పత్రికి వెళ్లి రక్త దానం చేశారు.

ఏజీపీని సత్కరించిన రైతు నాయకులు

నవతెలంగాణ -ఖానాపూర్

ఖానాపూర్ పట్టణానికి చెందిన ప్రముఖ అడ్వొకేట్ ఆసీఫ్ అలీ ఇటీవల ఖానాపూర్ కోర్టు ఏజీపీగా నియమితులయ్యారు. కాగా శుక్రవారం న్యాయవాది అసిఫ్ అలీని శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రైతు నాయకులు, సామాజిక ఉద్యమ కారులు హపావత్ రాజేందర్, గంగాధర్, విఠల్ పాల్గొన్నారు.

కళల ప్రాశస్త్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అనాదిగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలు, కళల ప్రాశస్త్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వాటి విశిష్టతను భావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని శ్రీగోపాల కృష్ణ విద్యా మందిర్‌లో నిర్వహిస్తున్న మంథనం ఒక సంకల్పం ఆధ్వర్యంలో జడ కొప్పులాట కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గురువారం రాత్రి జరిపిన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన జడకొప్పులాట కార్యక్రమాన్ని వీక్షించి, వారితో కలిసి సరదాగా ఆడుతూ తన చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అర్ధరాత్రి వరకు కార్యక్రమం కొనసాగగా, కళాకారులను, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ మంథనం ఒక సంకల్పం కళ సాంస్కృతిక వేదిక ద్వారా అంతరించిపోతున్న కళలకు జీవం పోసేలా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో జడ కొప్పులాటకు ఎంతో ప్రాధాన్యం ఉండేదని, ఇలాంటి ఆటలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. చలికాలంలో గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జడ కొప్పులాట గ్రామస్తుల మధ్య ఐక్యమత్యాన్ని పెంచడమే కాకుండా శారీరక ధృఢత్వం పెంచేందుకు సైతం దోహదం చేస్తుందన్నారు. సామజిక మాధ్యమాల వినియోగం పెరిగిపోయిన ప్రస్తుత రోజుల్లో సంప్రదాయాలను మరవకుండా వాటి ప్రాధాన్యతను తెలుసుకోవాలని తెలిపారు. ఇందుకు తన వంతుగా పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిషీకాంత్ దేశ్‌పాండే, అల్లూరి సంజీవరెడ్డి, కుపాటి మనోహర్, సతీష్, శ్రీపాద అనిరుద్, సాగర్ పాల్గొన్నారు.